తీపి లోచేదు

గ్రిల్సు తలుపులు పట్టుకుని చక్రాలలాంటి కళ్ళు యిటూ అటూ తిప్పుతూ రాధిక వీథిలోకి చూస్తున్నది. దిల్‌షుక్‌నగరు కాలనీ పగలు పది గంటలనుంచి సాయంకాలము నాలుగు గంటల వరకూ ఎటువంటి అలజడి లేకుండా ఉంటుంది మగవాళ్ళు ఆఫీసులకూ పిల్లలు స్కూళ్ళకూ వెళ్ళిన తరువాత ఆడవాళ్ళు చిన్న పిల్లలూ తలుపులు వేసుకుని ఇళ్ళల్లో ఉంటారు. పగలు రేడియో కార్యక్రమాలతో పాటు చిన్నపిల్లల ఏడుపులూ, అల్లరీ వినబడుతూ ఉంటుంది. ఒక్కతే బొమ్మలతో ఆడుకుని పుస్తకాలలో బొమ్మలు చూసుకుని విసుగు పుట్టినప్పుడల్లా గ్రిల్సు తలుపులు పట్టుకుని వీథిలోకి చూస్తూ ఉంటుంది రాధిక.

రాధిక తల్లికి మధ్యాహ్నం పడుకునే అలవాటు. తను పడుకోబోయేటప్పుడు వీథి వాకిలి దొడ్డి తలపూ తాళము వేసుకుని రాధికముందు ఇన్ని పుస్తకాలు బొమ్మలు పడేస్తుంది. రాధిక నిర్జీవమైన వాటితో ఆడుకుని విసుగు పుట్టినప్పుడల్లా వీథిలోకి తొంగిచూస్తుంది.

"ఏం చిన్నదొరసానీ, బాగున్నావా? పండ్లు తీసుకోవూ!" అరటిపళ్ళు అమ్మే మనిషి తలుపు దగ్గరికి వచ్చి పలకరించింది.

తల అడ్డంగా వూపింది రాధిక. క్రిందటి రోజున తండ్రి తెచ్చిన పళ్ళు అలమారలో ఉన్నాయి. లావు లావు ఎర్రటి అరటి పళ్ళను చూసిన కళ్ళతో రాధిక ఈ పళ్ళను చూసి ముక్కు విరిచింది.

"రేపు మంచి జామపళ్ళు తెస్తా. తీసుకుంటవా?" పళ్ళ మనిషి ముందుకు సాగిపోయింది. మళ్ళీ రాధిక చక్రాలవంటి కళ్ళను తిప్పుకూ వీథిలోకి చూస్తున్నది ఆరేడు ఏళ్ళపిల్ల పేడగంప నెత్తిన పెట్టుకుని బతకమ్మ పాట పాడుతూ వస్తున్నది.

రాధిక ముఖంలో ఆనందమూ, ఉత్సాహమూ పొంగులు వారాయి "ఇంత ఆలస్యంగా వచ్చావేం?" ఆ పిల్లను దగ్గరకు పిలిచి అడిగింది.

"అమ్మకు పై ఉదుకు చేసింది. నాయనకు రొట్టె చేసిపెట్టి నేను తిని వచ్చిన."

పనిమనిషి తలుపుకొట్టగానే రాధికతల్లి రామలక్ష్మి తలుపుతీసి మళ్లీ వెళ్ళి పడుకున్నది. రాధిక దొడ్డి దరవాజాలో నుంచి వీధి వాకిట్లోకి వచ్చింది.

ఆ పిల్ల రాధిక కంటే పీలగా ఉన్నది. తొడుక్కున్న గౌను నల్లగా మాసి పోయింది. చినిగిన పేలికలు, అక్కడక్కడ వేలాడుతున్నాయి. ఒంటినిండా బురద మరకలు. తల వెంట్రుకలు జడలు కట్టాయి. అయినా ఆ పిల్లను చూడ గానే రాధికకు ప్రాణము లేచివచ్చినట్లవుతుంది.

"ఆడుకుందాము వస్తావా!" ఆ పిల్ల భుజంమీద చెయ్యివేసి అడిగింది రాధిక. ఆ పిల్లను ప్రతిరోజూ రాధిక చూస్తూ ఉంటుంది ఆ వేళకు. మాట్లాడిం చక పోయినా చూసి ఉత్సాహాన్ని తెచ్చుకుంటుంది.

ఆ పిల్ల రాధికను కిందనుంచి పై వరకూ చూసింది. తెల్లగా బొద్దుగా వున్న రాధిక లేత గులాబీరంగు నైలాను గౌను తొడుక్కున్నది. తలవెంట్రు కలు చెవులకు పైగా నీలిరంగు రిబ్బనులతో ముడివేయబడ్డాయి. కాళ్ళకు నల్ల రంగు బూట్లు మెరుస్తున్నాయి. ఆ పిల్ల తన కాళ్ళనూ ఒంటిని చూసుకుని మళ్ళీ మళ్లీ రాధికను చూస్తూ ముఖము తిప్పుకుంటూ ముందుకు అడుగు వేసింది.

రాధిక ఆ పిల్ల చెయ్యి పట్టుకుని ఆపుతూ "నీ పేరేమిటి? నాతో ఆడుకో టానికి రావూ? ఈ చాక్‌లెట్ తినిచూడు" తన చేతిలో ఉన్నవాటిలో ఒకటి ఆ పిల్ల చేతిలో పెట్టింది.

"ఆడుకుందాము రా మరి" రాధిక మళ్లీ అడిగింది.

ఆ పిల్ల మెల్లగా "ఇదంతా పోగుచేసి తెమ్మన్నది అమ్మ లేకపోతే కొడు తుంది." అక్కడున్న పేడకుప్పల వైపు చెయ్యి చూపించింది. అప్పుడే ఆ కుప్ప లను పోగుచేసుకోవాలని తట్టలు తీసుకుని పిల్లలగుంపు బయలుదేరి వస్తున్నది. వాళ్ళ తగవులూ అరుపులూ అంతదూరం నుంచే విని పిల్ల గబగబా తట్టలోకి పేడ ఎత్తుకుంటున్నది. రెండు చేతులతో గంప నెత్తిన పెట్టుకుంటూ "ఈ గంప మా అమ్మకిచ్చి వస్తా" పిల్ల ముందుకు నడిచింది. రాధిక తల ఆడిస్తూ ఆ పిల్ల వెంట నడిచింది.

పందు చివరగా ఉన్న గుడిసె ముందరగా గంపదించి ''అమ్మా, గంప తీసుకోయే. నేను జరసేపు ఈడ ఆడుకొనివస్తా'' పిల్ల గునుస్తూ తల్లిని అడిగింది.

"చెల్లికి జొరము వేగిరం రా", తల్లి కేకలకు తల అడిస్తూ చేతులు కుండలో ముంచి గౌనుతో తుడుచుకుంటూ రాధిక చెయ్యి పట్టుకుని వేపచెట్టు క్రిందికి తీసుకువచ్చింది.

''నీ పేరు చెప్పవూ.'' ఆప్యాయంగా కళ్ళల్లోకి చూసింది రాధిక.

''ఈరమ్మ''

''నాతో రోజూ ఆడుకోవూ?'' ఆ పిల్ల రెండు చేతులు పట్టుకుని పైకెత్తింది రాధిక. ఇద్దరూ కలిసి పావుగంట గంతులు వేశారు. పరుగులు తీశారు.

''ఏందండీ! మీ కోసం ఈదులన్నీ యెతుకుతున్న. ఇంటికి పదండి. అమ్మగారు కోపము చేస్తున్నారు.''

ఈరమ్మ చేతుల్లోంచి రాధిక చేతులు విడిపించి ''ఎవరు పిల్లా నువ్వు? ఇంటికి పో'' కసిరాడు. వాళ్ళు ముందు నడుస్తూంటే ఈరమ్మ వెనక్కి తిరిగింది.

''చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్ళటం నేర్చుకున్నావా! ఎక్కడికి వెళ్ళద్దని చెప్పలేదూ!'' రామలక్ష్మి గట్టిగా మందలించింది.

''నే నెవరితో ఆడుకోను!'' కళ్ళు నులుపుకుంటూ వణుకుతున్న పెదవులతో అన్నది రాధిక.

''ఆట సామాను నాన్నగారు కొత్తగా తెచ్చినవని ఎన్నో ఉన్నాయి బొమ్మలు పుస్తకాలు ఉన్నాయి. చూసుకో ఇంకా ఏంకావాలి నీకు?'

''నీల''

నీల మాట ఎత్తగానే రామలక్ష్మి ముఖం ఎర్రబడ్డది నీలతల్లితో ఆమె ఘర్షణపడి పదిహేను రోజులయింది. అప్పటి సంఘటన ఆమెకు ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టవుతుంది.

భారతికి స్నేహితులు లేనిదే ఒక గంటయినా పొద్దుగడవదు. ఆమె ఒకరింటికయినా వెళ్ళాలి. లేక ఎవరయినా ఆమె యింటికి రావాలి. ఆమె మాటలో చేష్టలో ఒక్కటేచూపు

"మావారు ఇల్లు ఇలా ఉంటే ఊరుకుంటారా" అంటూ రామలక్ష్మి ఇంటికి వచ్చి నేల చూపించింది. నేల శుభ్రంగానే ఉంది కాని వట్టినేల. తివాచీగాని జంపఖానాగాని పరచిలేదు. రామలక్ష్మి ముఖం ప్రక్కకు త్రిప్పుకున్నది.

భారతి లేచి ఇల్లంతా చూస్తూ "మామంచాలు చూశారా. రోజ్‌వుడ్ అడుగున స్ప్రింగులు. నేను ఏడాదికి ఒక్కసారి ఫర్నిచరంతా పాలిష్ చేయిస్తా సుమా ! పాలు పెరుగూ పెట్టుకోవడానికీ, పళ్ళకూ, కూరగాయలకూ ఫ్రిజ్ ఉండా లండీ" మళ్లీ వచ్చి కుర్చీలో కూర్చుంది.

ఇందిరా గాంధీ పార్లమెంటులో యిచ్చిన స్పీచ్‌ని గురించి రామలక్ష్మి రెండుసార్లు ఎత్తినా భారతి వినిపించుకోలేదు.

"కంచి కాటన్‌చీరెలు నీలకంఠం దుకాణంలో క్రొత్తగా సరుకు వచ్చిందని ఫోన్ వచ్చింది కారు రాగానే ఇవ్వాళయినా వెళ్ళాలి" ఒళ్ళు విరుచుకుంది భారతి.

"మీరెట్లా ఉండగలుగుతున్నారో ! యింట్లో ఒక్కటే గది. డ్రాయింగు రూము లేదు. అయినా మీ కెందుకు డ్రాయింగు రూమ్? సోఫాసెట్ లేదు కదా-రామలక్ష్మిగారూ? నలుగురు పెద్ద మనుష్యులువస్తే ఎక్కడ కూర్చో బెడతారండీ" విరగబడి నవ్వింది.

రామలక్ష్మి ముఖం చిన్నబోయింది భారతి తన పట్టు చీరవంకా,రామలక్ష్మి గుంటూరు చీరవంకా మార్చి మార్చి చూచింది. రామలక్ష్మి ముఖం రోషంతో ఎర్రబడింది. క్షణక్షణానికి తన అధిక్యతను ప్రదర్శిస్తూ ఎదటివారిని దిగదుడుపుగా చూసే భారతి మాటంటే రామలక్ష్మికి అరికాలి మంట నెత్తికి ఎక్కుతున్నది. ఆనాటి నుంచీ రాధిక నీలలు కూడా తల్లుల అడుగుజాడల్లో నడవవలసి వచ్చింది. ఒకరి ఇంటికి ఒకరు వెళ్ళటానికి వీలులేదు. సాయంత్రము ప్లేగ్రౌండులో కలిసినా మాటలులేవు. తల్లుల ఆజ్ఞ ఇద్దరూ మీరలేకుండా ఉన్నారు.

"నీల మనఇంటికి వస్తున్నదా? నీవు ఊరికే నీల కోసం ఆరాటపడతావు."

"నీల ఆడుకోటానికి వాళ్ళయింట్లో చిన్న పాపాయి ఉంది. నే నెవరితో ఆడుకోను మరి?" ముఖానికి అడ్డంగా చెయ్యిపెట్టుకుని వాదించింది రాధిక.

రామలక్ష్మి రాధికను దగ్గరికి తీసుకుని తనలో తాను నవ్వుకుంది. రాధికకు బొమ్మలు చూపిస్తూ, కథలు చెబుతూ ఆనాటికి మనసు మళ్ళించింది. ఆ లేత మనసు అన్నిటికి సమ ధానపడిపోయింది. మరునాడు పగటిపూట తల్లి పడుకున్నప్పుడు రాధిక మనసులో ఈరమ్మ ఒకటి రెండు సార్లు మెదిలింది. రాధిక రెండు మూడు సార్లు బయటికి వెళ్లటానికి ప్రయత్నం చేసింది. తీరా తలుపు దగ్గరికి వెళ్ళేసరికి ముందు వరండా వెనక వరండాల గ్రిల్సుకు తాళమువేసి ఉంది. కళ్లలో నీళ్ళు సుళ్లు తిరుగుతుండగా గ్రిల్సు పట్టుకుని వాటికి తల ఆనించి జాలిగొలిపే చూపులతో రాధిక గంటలకొద్దీ నిలబడిపోయింది.

రాధిక ఆలోచనలు ఈరమ్మ యింటిమీదకి వెళ్ళాయి. రాధిక ఈరమ్మ ఇంటికి వెళ్ళినప్పుడు లోపలికి తొంగిచూసింది. ఆ నులకమంచం గుడ్డలమధ్య పడుకున్న పాపాయి ఎట్లా ఉన్నదో? ఈరమ్మ వీల వాళ్ళ ఇంట్లో ఉన్న పాపాయిలతో ఆడు కుంటారు. తనకొక చెల్లెలుంటే ఎంత బాగుండును? చక్కగా చిన్న చేతులను ముద్దు పెట్టుకుని ఎత్తుకోవచ్చు. తన బొమ్మలు. పుస్తకాలు పాపాయి కివ్వవచ్చు. ఊహాలు సాగిపోతూ ఉండేవి రాధికకు.

పదిరోజుల కంటె ఇంట్లోవాళ్ళు తలుపులకు తాళాలు వెయ్యలేక పోయి నారు. రామలక్ష్మి బద్ధకించింది. నౌకర్లు ఏమరిపోయారు. ఆ మధ్యాహ్నం రాధిక ఈరమ్మ గుడిసెకు దారితీసింది. ఈరమ్మ తల్లి ఎక్కడా కనబడలేదు. ఈరమ్మ మాత్రం గిన్నెలో అన్నం కలుపుకుని తింటున్నది. రాధిక మెల్లగా అడుగులు వేస్తూ వచ్చి మంచం దగ్గరగా నిలబడ్డది. చిన్నపిల్ల మంచంమీద నిద్రపోతున్నది.

“మీ పాపాయిని నాకు చూపించవు ఈరమ్మా” ఈరమ్మ తినే గిన్నెవైపు చూస్తూ అడిగింది రాధిక.

“నిద్రలో వుంది. చూడు ఆడుకోటానికి మళ్ళీ రాలేదేం?” ఈరమ్మ లోటాతో నీళ్ళుతాగి గిన్నె తొలిచి లోపలపెట్టింది.

రాధిక ఆ చిన్నపిల్లకు కప్పిన మురికి గుడ్డను చేత్తో తొలగించింది. ఆ పిల్లను చూడగానే రాధికకు కలిగిన ఆశ్చర్యానికీ. సంతోషానికీ మేరలు లేకుండా పోయాయి.

"ఈరమ్మా! నీ పాపాయి ఎంత బాగున్నదో. చేతులు కాళ్లూ ముక్కూ— అన్నీ ఉన్నాయి. పాపాయి మెత్తగా ఉంది. కదూ?" ముద్దుకొద్దీ పిల్ల చేతి వేళ్ళను రాధిక పెదవులకు ఆనించుకున్నది.

"మరి ఆడుకుందామా?" ఈరమ్మ అడిగింది.

రాధిక ఆ మాట వినిపించుకోకుండా ఆ చిన్న పిల్లవైపే చూస్తూ "ఈ పాపాయి ఇంతసేపు నిద్రపోతుందేమిటి ఈరమ్మా! రోజూ అన్నం పెడతారా? నోట్లో పళ్లు ఉన్నాయోమో చూడనీ" పిల్లనోట్లో వేలుపెట్టి చూచి "పాపాయికు పళ్ళు ఉండవా ఈరమ్మా?" చేతికి అంటిన తడిని గౌనుకు తుడుచుకున్నది.

"అమ్మాయిగారూ"

రాధిక అదిరి పడింది. తనంతట తానే గుడిసెలోనుంచి బయటికి వచ్చింది. మాట్లాడకుండా నౌకరువెంట నడచి యింటికి వెళ్ళింది. తల్లి రాధికను మందలించి ఆటసామాన్లు ముందర పదేసింది. ఈరమ్మ పాపాయిని కంటితో చూచిన తరువాత రాధిక దృష్టి బొమ్మలపైపు మళ్ళడం లేదు. బయటికి వెళ్ళటానికి వీలు లేకుండా ఇంట్లో కట్టుదిట్టాలు ఎక్కువయినాయి.

వారంరోజుల తరువాత అంటే ఉగాది వెళ్ళిన మరునాడు ఉదయం ఏడు గంటలకు రాధికను తండ్రి నిద్రలేపాడు. పాలు రొట్టె తీసుకున్న తరువాత రాధికను రిక్షాలో కూర్చోబెట్టుకుని బయలుదేరాడు.

"ఎక్కడికి నాన్నా?" రాధిక రెండుసార్లు అడిగింది.

"చూద్దువుగాని ఉండు" అన్నాడు తండ్రి ఎటో ఆలోచిస్తూ.

రాధిక ఆత్రము అధికమయింది. "నాన్నా యింకెంత దూరం? మనతో అమ్మ రాలేదేం?"

"మనం వెళ్ళేది అమ్మ దగ్గరకేనమ్మా. అదిగో వచ్చేశాము చూశావా."

మాట పూర్తికాకమునుపే రిక్షా ఆగింది. ఇద్దరూ దిగారు తండ్రితో నడుస్తూ రాధిక ఆలోచనలో పడ్డది." అమ్మ ఎక్కడికి వెళ్ళింది. తనతో ఎందుకు చెప్పలేదూ?"

పెద్ద ఆవరణందాటి పాతిక మెట్లు ఎక్కి వరండాలో ప్రవేశించారు ఇద్దరూ అక్కడినుంచి హాలులో ఉన్న మంచాలన్నీ దాటుకుని చివరి మంచం దగ్గరకి వెళ్ళి మలుపు తిరిగి గదిలో ఉన్న క్యూబికల్స్ పరదా తొలగించాడు తండ్రి. రాధిక చూపులు మంచంమీద పడుకున్న తల్లిమీదికి మళ్ళాయి. ఆమెను చూడగానే దుఃఖం ముంచుకు వచ్చింది రాధికకు. ఓ గజం దూరాన నిలబడిపోయింది. తండ్రి రాధికను ఎత్తుకుని మంచం పక్కకు తీసుకువెళ్ళి ఉయ్యాలమీద ఉన్న దోమతెరను తొలగించి చూపించాడు.

"ఆరే! పాపాయి పాపాయి నాన్నా ఈ పాపాయి ఎవరిపాపాయి నాన్నా? చెప్పు నాన్నా?" తండ్రిముఖం తనవైపుకు త్రిప్పుకుంటూ కేకలు పెట్టింది రాధిక. సంతోషం కొద్దీ రాధిక చప్పట్లు కొట్టింది. ముఖం చేటంతయింది. మునివేళ్ళ మీద నిలబడి ఉయ్యాలమీదకి వంగి పసిపిల్ల కాళ్లూ చేతులూ తాకి చూచింది. విస్మయాన్ని పట్టలేక "నాన్నా పాపాయి కాళ్ళు ఎంత బాగున్నాయో చూడు" రాధిక సంతోషాతిరేకంతో గంతులువేస్తూ గది అంతా తిరిగింది.

తండ్రి తల్లితో మాట్లాడేంతలో రాధిక ఆ గది దాటి హాలులో ఉన్న మంచాలన్నీ తిరిగి చూసింది ఉయ్యాలలన్నీ తొంగి చూసింది. పాపాయిలు-హాలునిండా పాపాయిలు ఎంతమందో!

పది గంటలు కొట్టారు. తండ్రి రాధికను ఇంటికి రమ్మని పిలిచాడు. పాపాయిని వదలిపెట్టి ఇంటికి వెళ్ళటం రాధికకు చాలా కష్టమనిపించింది. ఇంటికి వచ్చిన తరువాత కూడా రాధిక మనసు పాపాయి మీదనే ఉన్నది. ఇంట్లో పని చేసే మనిషిని పిలిచి పాపాయిని వర్ణించి చెప్పింది ఎవరికంటా పడకుండా ఈరమ్మ దగ్గరకువెళ్ళి పాపాయి సంగతి చెప్పి వచ్చింది. ఆ తన్మయత్వంలో ఆ రాత్రి రాధికకు నిద్రపట్టలేదు.

ఆ తరువాత అయిదారు రోజులపాటు రాధిక దినచర్య చాలా క్రమంగా గడిచిపోయింది. వేళకు నిద్రపోవటానికిగాని స్నానము చేయటానికిగాని, భోజనం చెయ్యటానికిగాని రాధికకు ఏ నౌకరు బ్రతిమిలాడవలసిన అవసరంరాలేదు. ఇదే అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది

ఏడవరోజు రాధిక హాస్పటల్నుంచి చిన్నబోయిన ముఖంతో ఇంటికి

వచ్చింది. తండ్రి పత్రిక చదువుతూ ఉండగా నౌకర్లను తప్పించుకుని రాధిక ఈరమ్మ దగ్గరికి వెళ్ళింది.

"ఈరమ్మా! మా పాపాయికి జ్వరము వచ్చిందని నాన్న చెప్పాడు. తాకి చూస్తే వేడిగా ఉంది" చెబుతూ ఉండగానే రాధిక కళ్ళనిండా నీళ్ళు వచ్చాయి

మా చెల్లికి కూడా జ్వరమొచ్చిది. తెల్లారి తగ్గిపోయింది." అన్నది ఈరమ్మ పిడకలుచేస్తూ ఆరిందాలా.

"మీ పాపాయికి ఏం మందు పోశారు ఈరమ్మా?'' దిగులుపడ్డ ముఖంతో ప్రశ్నించింది రాధిక.

''మా అయ్య పిల్లనోట్లో పసరు పిండాడు మా యమ్మ పోచమ్మకు మొక్కింది "

"ఎట్లా మొక్కుతారు ఈరమ్మా?" రాధిక అమితమయిన అసక్తి శ్రద్ధా ముఖంలో పొంగులు వారుతుండగా ఈరమ్మ భుజమ్మీద చెయ్యివేసి అడిగింది ఈరమ్మ చెప్పినట్టుగా ''పోచమ్మతల్లీ! మా పాపాయికి త్వరగా జ్వరం తగ్గించు తల్లీ'' కళ్లు మూసుకుని చేతులు జోడిస్తూ అన్నది. ఒంటరిగా సందులుగుండా ఇంటికి వస్తూ అనేక పర్యాయాలు అదే వల్లించింది. ఆ నిద్రలో కూడా పాపాయి జ్వరాన్ని గురించే కలవరించింది. తెల్లవారేసరికి ఆమె ముఖం వాడి వత్తిఅయింది.

"ఎందుకు రాధికా అలా వున్నావు?" తల్లి రాధికను దగ్గరికి తీసుకుంటూ అడిగి బుగ్గలు నిమిరింది

తల్లి అడగగానే రాధికకు ఎక్కడలేని దుఃఖమూ ముంచుకువచ్చింది. "పాపాయికి జ్వరంగా, నాకు ఏడుపు వస్తోంది '' వెక్కి వెక్కి ఏడ్చింది.

''అయ్యో పిచ్చిపిల్లా పాపాయికి జ్వరం వచ్చిందనా నీ ఏడుపు. అప్పుడే తగ్గి పోయింది చూడు. దగ్గరికి రా'' తల్లి రాధిక ఒడిలో పాపాయిని పడుకోబెట్టింది. నీళ్ళు నిండిన కళ్ళతో పాపాయిని చేతుల్తో పట్టుకుని నవ్వుతూ చూసింది రాధిక పావుగంటసేపు. బరువెక్కిన ఆ కళ్లు క్షణంలో మిలమిల మెరిశాయి.

పాపాయి యింటికి వస్తున్నదనగానే రాధిక మురిసిపోయింది, ఇంట్లో సామానులన్నీ తానే సర్దటం మొదలుపెట్టింది.

తన బొమ్మల బుట్టలో వున్న బొమ్మలలో కొన్నిటిని ఏరి బల్లమీద పెట్టింది. తన గౌన్లలో మంచి వనుకున్న వాటిని ఒక బీరువాలో పెట్టింది ఒకజత బూట్లు ఒక చిన్న గొడుగు ఆ గదిలో ఒక మూల భద్రపరిచింది పాలు తాగటానికి రెండు గ్లాసులు, ఒక పళ్ళెమూ బల్లమీద బోర్లించింది. ఇవికాక ఎన్ని దినాల మండో తాను జాగ్రత్తగా దాచుకున్న నెమలి ఈక, కాకి బంగారము ఒక చిన్న అట్టడబ్బాలో పెట్టి బల్లమీద పెట్టింది. ఈ ఏర్పాటులన్నీ తాను ఒక్కతే చేయటంలో రాధికకు తృప్తి కలగలేదు. పని మనిషిని పిలిచింది

ఆ ఇంట్లో ఎందరో నౌకర్లు ఇంతవరకూ పనిచేశారు. కాని ఎవరితోనూ రాధికకు సరిపడలేదు. రాజమ్మ రెండు సంవత్సరాల నుంచీ యింట్లో పనిచేస్తు వ్నది. వయసుమళ్ళిన మనిషి ఇంతవరకూ రాధికకు రాజమ్మతో ఏ విషయం లోనూ తగాదా రాలేదు రాధిక చేసిన పనులలో ఉన్న పొందికను. మాటల్లోని మాధుర్యాన్ని గ్రహించగల శక్తి ఒక్క రాజమ్మలోనే కనబడ్డది, రాధిక పిలవ గానే "ఏం తల్లీ?" అంటూ వచ్చింది రాజమ్మ.

"ఇవన్నీ ఎందుకో తెలుసా నీకు?" రాధిక రాజమ్మను అడిగింది.

"ఊహుం! తెలియదమ్మా? ఎందుకో చెప్పరూ" రాజమ్మ చేతులు నలుపు కుంటూ ప్రశ్నించింది.

"రాజమ్మా! ఇటుచూడు నేనూ నాన్నా వెళ్లి పాపాయినీ, అమ్మనూ యింటికి తీసుకుని వస్తున్నాము" అన్నది రాజమ్మకు ఎదురుగా నిలబడి.

"ఇప్పుడు వెళ్ళుతారా అమ్మా! నేను కూడా రానా?"

"వద్దు. నీవు యింట్లోనే ఉండాలి. పాపాయి వచ్చినప్పటి నుండి పాపాయి పనులన్నీ నీవే చేయాలి ఇవన్నీ పాపాయి కోసం తయారు చేశాను. చూడు!"

"ఈ పళ్ళెం గ్లాసులూ పాపాయికేనా అమ్మా!"

"అవును. పాపాయి భోజనం చెయ్యటానికి పళ్లెం, పాలు తాగడానికి గ్లాసులు కావాలా వద్దా?" రాధిక నడుంమీద చేతులు పెట్టుకుని అధికారంతో ప్రశ్నించింది.

రాజమ్మ పక్కకు తిరిగి నవ్వుతూ "పాపాయికి అన్నీ కావాలి" అన్నది.

పాపాయి ఇంటికి వచ్చిన తరువాత రాధికకు దినాలు నిమిషాలవలె గడిచి పోయాయి. పాలు తాగేటప్పుడు దగ్గర కూర్చునేది.

నిద్రపోగానే శ్రద్ధగా దోమతెరవేసేది. ప్రతి సాయంకాలం తండ్రి ఇంటికి రాగానే తన ఆధ్వర్యంకింద ఉదయంనుండి సాయంత్రం వరకూ జరిగిన పాపాయి దినచర్య వివరించేది. పాపాయి కదలికలను గురించి తండ్రితో చిత్ర విచిత్రంగా వర్ణించి చెప్పేది.

"అమ్మా పాపాయి నాతో ఎప్పుడు ఆడుకుంటుంది?" ప్రతిరోజు ఉదయం పాపాయి పాలు తాగేటప్పుడు ఎదురుగా కూర్చుని రాధిక అడిగే ప్రశ్న ఇది :

"ఇంకా ఏడాది కావాలి పాపాయి కొన్నాళ్ళయిన తరువాత నడుస్తుంది. అప్పుడు కాని నీతో ఆడుకోదు"

"పాపాయి నాతో ఎప్పుడు మాట్లాడుతుంది?"

"మాటలు వచ్చింతరువాత"

"పాపాయికి త్వరగా నడక రావాలి. పోచమ్మతల్లీ! మా పాపాయి నాతో మాట్లాడాలి. ఆడుకోవాలి" అనుకుంటూ రాత్రిళ్లు నిద్రపోయేది రాధిక.

ఉదయము లేవగానే "అమ్మా! పాపాయికి ఎన్నేళ్లు?"

"ఇంకా మూడవ నెల రాలేదుగా?" తల్లి నవ్వుకుంటూ చెప్పే జవాబుకు రాధిక ముఖము విసుగుతో ముడతలు పడ్డది.

ఉదయము పది గంటల వేళ రాధిక భోజనము చేసే సమయము. తల్లి దగ్గర కూర్చుని రైలు కథ చెప్పుతున్నది. కథ మధ్యలో "అమ్మా. పాపాయి ఎప్పుడు అన్నం తింటుంది?" రాధిక తల్లి గడ్డము పట్టుకుని ముఖాన్ని తనవైపుతిప్పుకుంటూ అడిగింది.

"ఇప్పుడు కాదమ్మా. పదినెలలు వస్తే అన్నం ముట్టిస్తాము. అప్పటినుంచీ తింటుంది. ఈలోగా పళ్లు కూడా వస్తాయి" చెప్పింది తల్లి.

"పళ్లు....పాపాయికి పళ్ళు" అంట్లచేత్తో చప్పట్లుకొట్టి పళ్ళు బయటకు పెట్టింది రాధిక.

రైలు కథ మరికొంతదూరం సాగింది. పళ్ళెంలో అన్నం కొంత తరిగి ది.

"పాపాయీ, నేనూ పలక తీసుకుని బడికి పోతామే అమ్మా!" కథను మధ్యలో ఆపి రాధిక తల్లి ముఖం తనవైపు తిప్పుకుంటూ గునిసింది.

"ఇంకా పాకటం రాదు-కూర్చోటం రాదు. నీతో బడికి ఎలా వస్తుంది?"

"అయితే నేనూ బడికిపోను" రాధిక ఈ మాట అంటూఉండగా పాపాయి ఏడుపు వినబడ్డది. తల్లి వెంటనే లేచి వెళ్లింది

తల్లి పాపాయిని తీసుకువస్తుందని రాధిక వేళ్ళు నోట్లో పెట్టుకుని ఎదురు చూస్తూ కూర్చుంది. అయిదు నిమిషాలు ఓపిక పట్టింది. ఆమె రాలేదు. పాపాయి ఏడుపు మాత్రం కొంతసేపటికి సర్దుకున్నది ఆ వెంటనే తల్లిదండ్రుల మాటలూ, నవ్వులూ రాధికకు వినిపించాయి. రాక వెంటనే పళ్ళాన్ని కాలితో తన్ని ఏడుస్తూ లేచిపోయింది.

ఆ నాడంతా రాధికకు ఏమీ తోచలేదు. అలవాటు చొప్పున పాపాయి ఉయ్యాల దగ్గరికి వెళ్ళింది. అక్కను చూసి పాపాయి నవ్విన బోసినవ్వులు రాధికకు ఆనందాన్ని కలిగించలేకపోయాయి.

ఉదయం లేస్తూనే రాధిక రాజమ్మను పిలిచింది రాజమ్మ రాలేదు తల్లిని పిలిచింది. తల్లి పలకలేదు. ప్రతిదినమూ ఉదయము ఏడు గంటలకు రాధిక నిద్ర నుండి లేస్తుంది. పావుగంట ముందుగా రాజమ్మ వచ్చి మంచందగ్గర కూర్చుని ఉండేది. రాధిక నిద్రలేచిన వెంటనే ముఖం కడిగి పాలూ రొట్టె తినిపించేది. కాని ఆనాడు ముందుగా వచ్చి కాచుకొని ఉండకపోగా రాధిక పిలిచినప్పుడయినా రాజమ్మ రాలేకపోయింది.

రాధిక మరికొంత సేపాగి మళ్ళీ పిలిచింది. ఎంతోసేపటికి రాజమ్మ వచ్చింది. రాధిక కోపాన్ని ఆపుకోలేక రాజమ్మమీద నిప్పులు కురిపించింది అలవాటు ప్రకారం రాజమ్మ "సీబాంచను కాల్మొక్కుతా" అని అరోజు అనలేద మాట్లాడకుండా వెళ్ళిపోయింది. పాపాయి పనులతో తీరుబడిలేని రాజమ్మ గబగబా అడుగులు వేసింది.

ఈమధ్య రాజమ్మలో కలిగిన మార్పు రాధిక గ్రహించింది రాజమ్మలో తనపట్ల అవిధేయత పొడచూపుతున్నట్టుగా రాధిక కనిపెట్టింది. ఇదివరలో రాధిక ఆట లాడేటప్పుడు రాజమ్మ ఎదురుగా కూర్చునేది. రాధిక వెంబడి తిరుగుతూ ఉండేది. ఇప్పుడు రాజమ్మ మాటలలో రాధికను గురించిన కుతూహలమూ, ఆసక్తి కనబడడంలేదు రాజమ్మ ఇల్లా ఎందుకు చేస్తున్నది.?

ప్రతి దినమూ రాత్రి పడుకోబోయేముందు తల్లి దగ్గర కూర్చుని రాధికకు కాకి - నక్క కథ చెప్పే అలవాటు "కాకిబావా! నీ కంఠం ఎంత మధురం!" అని నక్క అనే పట్టులో కళ్ళుమూతలు పడుతున్నా రాధిక ఒక్కసారి నవ్వి నిద్రపో తుంది. ఈ మధ్య సరిగ్గా ఆ సమయానికి పాపాయి ఏడుస్తున్నదంటూ తల్లి ఉయ్యాల దగ్గరే ఉంటున్నది. తల్లికి బదులుగా రాజమ్మ కాకికథా పిల్లికథా చెప్పినా రాధికకు నిద్రరావటంలేదు

రాధికకు వారంరోజుల నుండీ అన్నం హితవు తప్పినట్టుంది. భోజనము చేయాలని లేదు. రాత్రిపూటా భోజనం దగ్గర ఏదో లోపము కనబడుతున్నది. తల్లితో ఘర్షణపడుతున్నది. ఎప్పుడూ ఏడుపు రాత్రివేళ కలతనిద్ర, మధ్యమధ్య ఏడుపు రాధికకు ఇప్పుడు పాపాయిమీద గాని ఆటలమీదగాని ఆసక్తిలేదు. ప్రతి రోజు సాయంకాలపు వేళ తండ్రితో కబుర్లు చెబుతూ ఆయనవెంట తిరిగేది- ఇప్పుడు తండ్రి ఆ సమయంలో పత్రిక చదువుతూ పాపాయి దగ్గర కూర్చుని పాపాయి బోసినవ్వులు చూసి ఆనందిస్తున్నాడు. ఆ సమయములో రాధికకు చెప్ప లేనంత దుఃఖము పొంగి పొంగి వస్తున్నది. చికాకుగా జుట్టుపీక్కుంటూ తిరుగుతూ రాధిక ఇప్పుడు అందరిచేత చివాట్లు తింటున్నది.

నెల రోజులలో రాధిక నల్లబడి చిక్కిపోయి సగమయింది తల్లీ తండ్రి డాక్టరు దగ్గరికి తీసుకువెళ్లి చూపించారు. మందు తీసుకోడానికి రాధిక పేచీ పెట్టడమూ తల్లిచేత దెబ్బలు తినటమూ దినచర్యగా మారింది. రాధిక నౌకర్ల మీద తల్లిదండ్రులమీద తిరుగుబాటు చెయ్యటం మొదలుపెట్టింది.

ఉదయం ఎనిమిది గంటలవేళ రాధిక రాజమ్మను పిలిచింది. రాజమ్మ అరగంట క్రితమే మరొక పనిమీద అక్కడినుంచి వెళ్లింది. హాలులోనూ, వరండాలోనూ రాజమ్మ కనబడలేదు. ఎదురుగా ఉన్న గదిలో దోమతెర కప్పిన

ఉయ్యాల. రాధికముఖం జేవురించింది. కోపముతో దేహము వణికిపోయింది. తలుపులు కదలకుండా పెట్టిన ఇసుక సంచులు రాధిక చక్రాలవంటి కళ్లను ఆకర్షించాయి. వాటిని చూడగానే రాధికకు తటాలున ఒక ఊహ మెరపులా మెరిసింది. వెంటనే ఇసుక సంచి అందుకుని బలము కొద్దీ ఉయ్యాల మీదికి విసరబోయింది. కాని కాలుజారి బోర్లపడ్డది. ఇసుక సంచి ఉయ్యాల కోడుకు కొట్టుకుని పెద్ద చప్పుడు చేసింది.

రాధిక ఏడుపు స్నానాల గదిలో ఉన్న తల్లికి వినిపించింది. అప్పుడే స్నానము చేయించిన పాపాయిని తువ్వాలతో తుడుస్తూ ఒక్క అంగలో వచ్చి చూసింది. ఆమె వెనుక పాపాయిని పట్టుకుని రాజమ్మ వచ్చింది.

పాపాయిని చూడగానే దెబ్బ తగిలినప్పటి కంటె బాధతో రాధిక ఏడుస్తూ కాళ్ళు నేలకు రాయడం మొదలు పెట్టింది. రాధిక ఎదలో ఏదో బాధ చెప్పలేనిదీ తీరనిదీ స్థావరమేర్పరచుకున్నది. ఇప్పుడు రాధికను నవ్వించగలిగినదేదీ లేదు. ఆ తరువాత ఆమెను నవ్వగా చూచినవారూ లేరు. పాపాయిని ఎత్తుకున్న తల్లిని చూసినప్పుడు మాత్రం రాధిక ఎవరో కొట్టినట్టుగా గీపెట్టి ఏడుస్తుంది. రాత్రిళ్లు పడుకోబోయేటప్పుడు "పోచమ్మ తల్లీ! ఈ పాపాయిని తీసుకుపో" అంటూ గొణుక్కుంటూ ఉంటుంది బక్క చిక్కిన రాధిక.

(ఆంధ్రజ్యోతి-సచిత్ర వార పత్రిక)